


ఆశ్రమ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కరుణ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : పాడేరు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ఆదేశాల మేరకు మండలంలోని జాముగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థులకు కిల్లోగుడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె.కరుణ ఆధ్వర్యంలో చర్మవ్యాధి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తామర, గజ్జి, దురద వంటి చర్మవ్యాధుల పరీక్షలు నిర్వహించడంతోపాటు రక్తంలో హిమోగ్లోబిన్ శాతం, బరువు పరీక్షలు చేసి, ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన


మాట్లాడుతున్న కమిషనర్ అరుణ్‌కుమార్

ప్రజాశక్తి -పెదబయలు రూరల్ : అంతర్జాతీయ చిరుధాన్యాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని గంపరాయి గ్రామంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ప్రత్యేక కమిషన్ ఆదేశాల మేరకు చిరు ధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమ పర్యవేక్షకులు, అమరావతి నుంచి వచ్చిన వ్యవసాయశాఖ కమిషనర్ దండు అరుణకుమార్ మాట్లాడుతూ, రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించడంతోపాటు వాటికి కనీస మద్దతు ధర కల్పనకు రైతులను ఎఫ్‌పిఒలుగా ఏర్పాటు చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. గిరిజన రైతులు తాము సాగు చేసే చిరుధాన్యాల వివరాలను రైతుభరోసా కేంద్రాల వద్ద, ముఖ్యంగా అందుబాటులో ఉన్న సచివాలయ సహాయకులు జానకిరామ్ వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిసిఎన్‌ఎఫ్ సభ్యురాలు శాంతి, ఎఒ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌కు శాశ్వత చట్టం చేయాలి

గిరిజన సంఘం ఆధ్వర్యాన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను శాశ్వత చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ముంచంగిపుట్టు మండల కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపి గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా గిరిజనసంఘం మండల కార్యదర్శి ఎం.ఎం.శ్రీను మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం దారిమళ్లించి ఆదివాసీల అభివృద్ధిని నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ హంగులు, ఆర్బాటాలకు పెద్దపీట ప్రజాసంక్షేమాన్ని పాలకులు గాలికొదిలేశారని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధం సంక్రమించిన ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా వినియోగం కావాలంటే దీనికి పకడ్బంది చట్టం చేయడంతోపాటు, ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలుకు కృషిచేయాలని కోరారు. రాజకీయ ప్రయోజనాల కోసం వెంపర్లాడుతూ, ఓట్ల రాజకీయంతో సబ్‌ప్లాన్ నిధులను ఇష్టారాజ్యంగా వినియోగిస్తే, అదే ఓట్లతో ప్రజలు బుద్ధిచెప్పే రోజు ఎంతో దూరంలో లేదని హెచ్చరించారు. నేటికీ కనీస సౌకర్యాలకు నోచుకోని గిరిజన గ్రామాలెన్నో ఉన్నాయని, ఇప్పటికైనా మరో పదేళ్ల సబ్‌ప్లాన్‌ను కొనసాగిస్తూ ఆర్డినెన్స్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం దీనికి శాశ్వతచట్టరూపం కల్పించి, దాన్ని పక్కాగా అమలు చేయడం ద్వారా గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేసి, తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాంగి భీమారాజు, కొర్ర శంకరరావు, వంతల లైకోన్, మహిళ సంఘం నేతలు సీసా విజయలక్ష్మి, ఎం. ఈశ్వరి, దూరు ధనలక్ష్మి పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో అధ్యాపకుల్లేక.. సందిగ్ధంలో 15 మంది విద్యార్థుల చదువు

ప్రజాశక్తి-అడ్డతీగల
మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఒక్క అధ్యాపకుడు కూడా లేకపోవడంతో ఆ కళాశాలలో చేరిన 15 మంది విద్యార్థుల చదువు సందిగ్ధంలో పడింది. జడ్పీ హైస్కూల్లో నూతనంగా జూనియర్ కాలేజీని ప్రారంభించగా, బైపిసి గ్రూపులో 15 మంది విద్యార్థులు చేరారు. కళాశాలను అయితే ప్రారంభించారు గాని అధ్యాపకులను నియమించడం ప్రభుత్వం మరిచింది. దీంతో జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులతో బైపిసి గ్రూపును నడుపుతూ వచ్చారు. అయితే వారిద్దరిలో ఒకరిని లాగరాయి జడ్పీ హైస్కూల్‌కు, మరొకరిని బూరుగుపూడి జడ్పీ హైస్కూల్‌కు డిప్యూటేషన్‌పై పంపించారు. దీంతో ఒక్క బోధకుడు లేకపోవడంతో 15 మంది విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. అధ్యాపకులను నియమించాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. దీంతో విద్యార్థులు మీడియా ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో ప్రజాశక్తి ఫోన్‌లో డిఇఒను సంప్రదించగా ఆయన అందుబాటులో లేరు. ఎంఇఒను సంప్రదిస్తే త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని చెబుతున్నారు. ప్రస్తుతం హైస్కూల్లో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేయాలని, లేకుంటే తమను ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విలీనం చేయాలని 15 మంది విద్యార్థులు కోరుతున్నారు.

ఇంటింటా ఓటర్ల సర్వే చేయండి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఇంటింటికి వెళ్లి పివిటిజి ఓటర్ల సర్వే, నమోదు పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్లు, ఐటిడిఎ పిఒలు, 22 మండలాల తాహశీల్దార్లతో ఓటరు నమోదు, భూముల రీసర్వేపై కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చేనెల 8వ తేదీలోగా ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసారు. పాడేరు, రంపచోడవరం డివిజన్‌ల పరిధిలో పివిటిజి ఓటర్ల గణాంకాలపై ఆరాతీసారు. 6(బి) 7(బి) ఫారాలు సేకరణపై తాహశీల్దారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గడిచిన మూడేళ్లలో 18 ఏళ్ల పైబడి మృతి చెందిన వారి వివరాలను ఎంపిడిఒల ద్వారా సేకరించాలన్నారు.. ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు ఓటరు జాబితాను ముద్రించి రాజకీయపార్టీలకు అందజేసి రశీదు తీసుకోవాలన్నారు. ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు...

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా పౌర సేవలందించడంలో జాప్యం చేయకూడ దన్నారు. భూముల రీ సర్వే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. 86 గ్రామాలలో రీ సర్వే, 19 గ్రామాలలో కోరిలేషన్ పూర్తి చేసారన్నారు. భూముల రికార్డులు ప్యూరిఫికేషన్ చేసిన తరువాత 9(2)నోటీస్ ఇచ్చి గ్రామసభలు నిర్వహించాలని స్పష్టం చేసారు. విలేజ్ సర్వేయర్, విఆర్‌ఒ లాగిన్ రీసర్వే డేటా సక్రమంగా నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ, జెసి జె.శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, ఎడి సర్వే వై.మోహనరావు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాల్సిందే

తహశీల్దార్‌కు స్పష్టం చేసిన అఖిలపక్ష నేతలు


అఖిలపక్ష నేతల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలో బినామీల పేరుతోనూ, నేరుగా గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని, లేకుంటే తామే కూల్చేస్తామని అఖిలపక్ష నేతలు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అఖిలపక్ష నేతలతో తహశీల్దార్ రాజ్యలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమ కట్టడాలు, బినామీ నిర్మాణాలపై సర్వే, ఎల్‌టిఆర్ కేసులు నమోదు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం అఖిలపక్ష నేతలు మాట్లాడుతూ గిరిజనేతరులకు ప్రభుత్వ స్థలాలను దారాధత్తం చేస్తుంటే అఖిలపక్షం చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. అధికారులే స్పందించి తక్షణ చర్యలు తీసుకోకుంటే, అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వాటిని కూల్చేస్తామన్నారు. మండలకేంద్రంలో గిరిజనులకు జీవనోపాధికి చిన్న దుకాణాల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరారు. ఇకపై మండలంలో ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణ, అన్యాక్రాంతం జరిగితే దానికి రెవెన్యూ అధికారులదే బాధ్యత అని హెచ్చరించారు. కార్యకమంలో జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం, వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు, కోట్నపల్లి ఎంపిఇసి సాంబే బాలకష్ణ, తడిగిరి సర్పంచ్ పి రంజిత్‌కుమార్, మత్స్యపురం సర్పంచ్ పూజారి సుబ్బారావు, బాకూరు నేత నైని సత్తిబాబు, దూసూరు వెంకటరావు, వైసిపి నాయకులు భూషణ్ మజ్జి, తెలుగుదేశం నాయకులు మాజీ సర్పంచ్ పి.కామేష్, పి శంకర్ నాయుడు, ఎస్ ఈశ్వరరావు, సురేష్, బిఎస్‌పి నాయకులు పాంగి కొండన్న, జనసేన నాయకులు సిహెచ్ రాజు, బిబి.ప్రసాద్, గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపులా కృష్ణారావు, అధ్యక్షుడు కిల్లో రామారావు, నాయకులు ముదిలి కైలాష్, ఆర్ఐ రంగారావు, విఆర్ఒ దనిసాని కొండబాబు పాల్గొన్నారు.


చిన్నారి అనిత మృతదేహం

అనారోగ్యంతో గిరిజన బాలిక మృతి

సరైన వైద్యం అందకపోవడమే కారణం ?

ప్రజాశక్తి- మోతుగూడెం
చింతూరు మండలం, మోతుగూడెం పరిధిలో ఉన్న రాజ్ క్యాంప్‌లో మంగళవారం గిరిజన బాలిక గోలారీ అనిత అనారోగ్యంతో మృతి చెందింది. రాజ్ క్యాంపులో నివాసముంటున్న గోలారీ సోమార, గోలారీ డోంబై మూడో కుమార్తె అయిన అనిత రాజ్ క్యాంపు గ్రామానికి ఐదు కిలోమీటర్లు దూరంలో ఉన్న ఫార్బయ్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతుంది. వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న బాలికను చిత్రకొండ ఆసుపత్రిలో చేర్చారు. అయితే అక్కడ సరైన వైద్యం అందలేదని బంధువులు తెలిపారు. సోమవారం రాజ్ క్యాంపులోని ఇంటికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమించి సోమవారం రాత్రి అనిత మరణించింది. సమాజనికి దూరంగా విసిరేసినట్టు ఉండే ఈ రాజ్ క్యాంపు గ్రామంలో 12 కుటుంబలు, 40 మంది జనాభా ఉన్నారు. మోతుగూడెంకు 16 కిలోమీటర్లు దూరంలో ఫార్బయ్‌కి ఐదు కిలోమీటర్లు దూరంలో ఉంటున్న ఈ గ్రామానికి కాలినడక బాటలో వెళ్ళాలి. రోడ్డు సౌకర్యం, కరెంట్ సౌకర్యం, నీళ్ల సౌకర్యం కూడా లేవు. ప్రతి రోజూ ఐదుగురు పిల్లలు కాలినడకన ఫార్బయ్ స్కూల్‌కి చదవడానికి వెళ్తున్నారు. అనారోగ్యం చేసినా, గర్భిణుల ప్రసవ సమయంలోనూ, ఏ సమస్య వచ్చినా రెండు కిలోమీటర్లు అడవి కొండల నడుమ నాలికడకన ప్రయాణించాలి. వర్ష కాలంలో వీరి బాధలు వర్ణించలేనివి. చాలాసార్లు అధికారులకు వీరి గోడు విలిపించినా కనీస సౌకర్యాలు కల్పించలేదు. ఇప్పటికైనా అధికారలు తమ గ్రామానికి రోడ్డు, కరెంట్, వైద్య సౌకర్యాలు కల్పించాలని వారు కోరుకుంటున్నారు.

శరవేగంగా గాంధీజీ విగ్రహ ఏర్పాటు పనులు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న గ్రౌండ్లో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్థానిక ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, ఏపీ జెన్కో ఉన్నతాధికారులు, ఇంజనీర్లు, కార్మికులు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి స్థానిక డిఎవి పాఠశాల, బాలికల ఆశ్రమ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, కాన్వెంట్ విద్యార్థులకు గాంధీజీ గొప్పతనంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు.


అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

గురుకుల కళాశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-మారేడుమిల్లి : 66వ ఎపి ఇంటర్ డిస్ట్రిక్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్- 2023 అండర్ 19లో స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థి ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్ఆర్ అంజనేయులు మంగళవారం తెలిపారు. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగిన స్టేట్‌త లెవెల్ మిట్‌లో కళాశాలకు చెందిన పి.నాగ సురేష్, ఎ. ఉదయ్ కిరణ్ రెడ్డి 1500 మీటర్ల పరుగు, జె.దుర్గ ప్రసాద్ జావలిన్ త్రోలో పాల్గొన్నారు. నాగ సురేష్ 1500 మీటర్ల రన్నింగ్‌లో రెండోవ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ విద్యార్థులకు మారేడుమిల్లి సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు రాము, జ్వాల సాగర్ రన్నింగ్ ప్రాక్టీస్‌లో ప్రోత్సాహం అందించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

ఎడిఎంహెచ్ఒ డాక్టర్ లీలాప్రసాద్



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ లీలాప్రసాద్

ప్రజాశక్తి -హుకుంపేట : పాడేరు డివిజన్ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, పోస్టుమెట్రిక్ వసతి గృహాలు, ఏకలవ్య,మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, యుపి పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చూపొద్దని విద్యాలయాలు, వైద్యఆరోగ్య సిబ్బందికి ఎడిఎంహెచ్ఒ డాక్టర్ లీలాప్రసాద్ సూచించారు. ఐటిడిఎ పిఒ ఆదేశాల మేరకు డివిజన్‌పరిధిలోని విద్యాలయాల్లో విద్యార్థులకు విస్తృత ఆరోగ్య తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు ఈ సందర్భంగా మంగళవారం హుకుంపేట మండలం పెదగరువు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మెహర్ సుమన, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యఆరోగ్యశిబిరాన్ని సందర్శించారు. పాఠశాలలో 510 మంది విద్యార్థినులకుగాను, 247 మందికి ఆరోగ్యపరీక్షలు నిర్వహించగా, వారిలో 26మంది బాలికలకు రక్తహీనత, చర్మవ్యాధులు, తక్కువ బరువు, దృష్టిలోపం వంటి సమస్యలున్నట్లు గుర్తించి, మందులు అందజేశారు. ముున్నగు వ్యాధులతో బాధపడుతున్న 26 మందికి పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. కె. లీలాప్రసాద్ మాట్లాడుతూ పాడేరు డివిజన్ పరిధిలోని మండలాల వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖాధికారులు ముందస్తు ప్రణాళిక, సమన్వయంతో విద్యార్థులకు ఆరోగ్యనపరీక్షలు నిర్వహించాలన్నారు. సికెల్‌సెల్ ఎనీమియా, ఇతర తీవ్ర వ్యాధులతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించే చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. 1 జిల్లా ఆసుపత్రి టిఇఐసి మేనేజర్ కిషోర్, పాడేరు స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సిహెచ్‌నాగరాజు పడాల్, పాడేరు ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణాధికారి గుల్లేలి సింహాద్రి, పిహెచ్‌సి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై అంగన్‌వాడీల ధర్నాలు

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్



కొయ్యూరులో ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు


చింతూరులో ధర్నా అనంతరం వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కొయ్యూరు
తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కొయ్యూరు ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు వై.అప్పలనాయుడు మాట్లాడుతూ అంగన్వాడీలకు పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని, కనీసం వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పింఛను సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని, అంగన్వాడీలను ఐసిడిఎస్ అధికారులు మాత్రమే పర్యవేక్షించాలని కోరారు. బకాయి జీతాలు, పెండింగ్ బిల్లులు, టిఎ, డిఎలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు ఎల్.ముత్యాలమ్మ, డివి.రమణమ్మ, పూర్ణ, దేవుడమ్మ, రాజేశ్వరి, వెంకటరమణ, రత్నం, బంగారమ్మ, కళ, గిరిజన సంఘం నాయకులు ఎస్.సూరిబాబు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

చింతూరు : అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన చింతూరు సెంటర్ నుండి ఐసిడిఎస్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి పోడియం సావిత్రి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాల విత్యుత్ బిల్లులు 8 సంవత్సరాల నుండి చెల్లించడం లేదని, దీంతో కార్యకర్తలు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పని చేయడం లేదన్నారు. పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, సీనియార్టీ ప్రకారం వేతనాలు ఇవ్వాలి, అనంతరం సూపర్వైజర్లకు వినత పత్రం ఇచ్చారు. యూనియన్ నాయకులు సవలం వెంకటరమణ, దుర్గ, పార్వతి, వసంత, జయ, భద్రమ్మ, కామేశ్వరి, సావిత్రి, సీఐటీయూ మండల సహాయ కార్యదర్శి బి.దిలీప్, నాయకులు కారం సుబ్బారావు పాల్గొన్నారు.

జి మాడుగుల : లేనిపోని యాప్‌లతో అంగన్వాడీలను ఒత్తిడికి గురిచేయొద్దని సిఐటియు మండల కార్యదర్శి జె. దీనబంధు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు నాయకులు ఎం.వెంకటలక్ష్మీ, జి. మోదకొండమ్మ అన్నారు. మంగళవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు మంగళవారం మండలకేంద్రంలో ఆందోళన చేపట్టారు. సిడిపిఒ సువర్ణకుమారికి 13 డిమాండ్లతో వినతిపత్రాన్ని యూనియన్ నాయకులు అందజేశారు. ప్రాజెక్టు, సెక్టార్ నాయకులు సత్యవతి, రాజేశ్వరి, సింహాచలం, కాంతమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వే ప్రారంభం


భూసర్వేను ప్రారంభిస్తున్న ఎంపిటిసి

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండలంలోని పెదలువ్వాసింగి పంచాయతీ చిలకలపాలెం గ్రామంలో సమగ్ర భూరీసర్వే కార్యక్రమాన్ని మంగళవారం ఎంపిటిసి గబ్బాడి సన్యాసిదొర ప్రారంభించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు సర్వేను సమగ్రంపూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్ మత్స్యరాస జయసింహారాజు, లకే రామకృష్ణ, విఆర్‌ఒ కాంతారావు, వాలంటీర్ కర్రినాయుడు పాల్గొన్నారు.

గిరి పల్లెల్లో జోరుగా 'చేపల షికారు'

పండగ వాతావరణాన్ని తలపిస్తున్న వేట


చేపల షికారు చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-విఆర్.పురం
మండలంలోని గిరి పల్లెల్లో చేపల షికారు జోరుగా సాగుతోంది. వేసవి ప్రారంభానికి ముందు వ్యవసాయ చెరువుల్లో గిరిపుత్రులు సంప్రదాయ బద్ధంగా వెదురు బుట్టలు, వెదురు బొంగు దింపుడు వలలతో చెరువుల్లో చేపల షికారు చేస్తూ ఉంటారు. మంగళవారం విఆర్.పురం వారాంతపు సంత సముదాయం పక్కనే ఉన్న చెరువులో గిరిజనులు పెద్ద సంఖ్యలో చేపల షికారు చేశారు. గోదావరి వరదల సందర్భంలో గోదావరి నది నుండి చేపలు ఈ చెరువుల్లోకి పెద్ద సంఖ్యలో చేరాయి. దీంతో చేపల షికారు చేసిన గిరిజనులకు పెద్ద మొత్తంలో చేపలు దొరికాయి. ఊర్లకు ఊర్లుగా తరలివెళ్ళి చేపల షికారు చేశారు. చేపల షికారు దృశ్యాలు ఆసాంతం పండుగ వాతావరణాన్ని తలపించాయి.

చేపల షికారుకు గిరిజనుల ప్రాధాన్యత

మన్యంలోని గిరిజనులు పండుగలు, పబ్బాలకు ఎంత ప్రాధాన్యత ఇస్తారో, చేపల షికారుకు సైతం అంతే ప్రాధాన్యత ఇస్తారు. వ్యవసాయ చెరువుల్లో చేసే చేపల షికారులో చాలా నిబంధనలు పాటిస్తారు. చెరువుల్లో చేపల షికారు చేయాలని భావించినప్పుడు, చుట్టు పక్కల గ్రామాల కుల పెద్దలు, చెరువుకు సంబంధించిన గ్రామ పెద్దతో చర్చిస్తారు. వీరంతా ఫలానా రోజు ఏ చెరువులో షికారు చేయాలో నిర్ణయించుకొని, తమ గ్రామాల్లోని ప్రజలకు సమాచారం ఇస్తారు. ఇలా అందురూ కలిసి పెద్ద సంఖ్యలో చెరువుల వద్దకు చేరుకొని చేపల షికారు చేస్తారు. ఈ షికారులో దొరికిన చేపలను అంతా సమానంగా పంచుకొని ఆరగించి, ఎనలేని ఆనందం, అనుభూతిని పొందుతారు. తరాలు మారినా, మన్యంలోని గిరిపుత్రులు పండుగలు, పబ్బాలు, వేట, చేపల షికారు లాంటి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. వీటి నిర్వహణ ద్వారా వారిలోని ఐకమత్యాన్ని చాటి చెబుతారు.

ఆధునిక సాగు విధానంతో అధిక దిగుబడులు

- ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.శివకుమార్



ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎ అందిస్తున్న వ్యవసాయ ఉపకరణాలు వినియోగించి గిరిజన రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించి గిట్టుబాటు ధర పొందవచ్చని చింతపల్లి ఉద్యానవన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వి.శివకుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కేంద్ర స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలో సుగంధ ద్రవ్య పంటలు సాగుపై నిర్వహించిన శిక్షణ తరగతుల్లో మాట్లాడుతూ కాఫీ తోటల్లో నీడ తక్కువగా ఉన్నచోట అంతర పంటగా పన్నీర్ -1 రకం మిరియాలు సాగు చేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయన్నారు. తేవం రకం నాటుకుంటే తెగుళ్లను తట్టుకుంటుందన్నారు. పన్నీర్-5, కరిముండ రకాలు నీడ ఎక్కువగా ఉన్న తోటల్లో సాగు చేయాలని సూచించారు. పసుపు శు ద్ధి చేసేటప్పుడు ఐటిడిఎ పంపిణీ చేసిన పాలిషింగ్ యంత్రాలు వినియోగిస్తే మంచి నాణ్యత వచ్చి, మంచి ఖరీదు వస్తుందన్నారు. గోనెసంచులో వేసి కొట్టడం వలన పసుపు కొమ్ములు విరిగిపోయి సరైన ధర రాదన్నారు. ఏజెన్సీలో రోమా, ప్రగతి, దేశవారి రకాలను గిరిజనరైతులు సాగు చేస్తున్నారన్నారు. 2.5శాతం, మూడు శాతం కురుకుమిన్ ఉన్న పసుపుకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు.

స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డు అధికారి బి.కల్యాణి మాట్లాడుతూ ఉద్యానవన వ్యవసాయాధికారులు శిక్షణను సద్వినియోగం చేసుకుని, రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గత ఏడాది 75 శాతం రాయితీపై 82 మంది గిరిజన రైతులకు మిరియాలు వలిచే యంత్రాలను పంపిణీ చేసామన్నారు. ఈ ఏడాది మరో 50 మంది రైతులకు వీటి పంపిణీకి గిరిజన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్ నంద్, జిల్లా ఉద్యావన అధికారి రమేష్‌కుమార్ రావు, కాఫీ బోర్డు డిడి జయంతి ఘోష్, 11 మండలాల వ్యవసాయాధికారులు, ఉద్యానవన అధికారులు, సచివాయలయం ఉద్యానవన సహాయకులు, వ్యవసాయ సహాయకులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పింఛను మంజూరు పత్రాలిస్తున్న సర్పంచ్ హరి

ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామసభలో తీర్మానించినట్లు సంగం పంచాయతీ సర్పంచ్ కె హరి తెలిపారు. పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతూ పంచాయతీలోని కొర్రాగుడలో మంచినీటి ట్యాంకు మరమ్మతు, ఒంబి, దొరగూడలో మంచినీటి ట్యాంక్‌ల నిర్మాణంతో పాటు, కంద్రుమ్‌లో రచ్చబండ నిర్మాణం చేపట్టాలని తీర్మానించారు. కొత్తగా 16 మంది వికలాంగులు, వితంతు, వయోవృద్ధులకు పింఛన్లు మంజూరుకు గ్రామసభలో తీర్మానించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి ఎస్ ఆనందరావు, ఉప సర్పంచ్ కె ప్రతిమ, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

ప్రజాశక్తి-రోలుగుంట : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 26 గణతంత్ర దినోత్సవం రోజు నుంచి అన్ని గ్రామాల్లో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ఇఓపిఆర్‌డి మల్లికార్జునరావు కోరారు. మంగళవారం ఎంపిడిఓ ప్రభాకరరావు అధ్యక్షతన ప్లాస్టిక్ నిషేధంపై అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలు ప్లాస్టిక్ రహితం కావాలన్నారు. దీనిపై గ్రామాల్లో ఫ్లెక్సీలు, ప్లాస్టిక్ సంచులు వినియోగించకుండా కార్యదర్శులు, విఆర్‌ఒలు చర్యలు చేపట్టాలన్నారు.

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీల ఆందోళన

పజాశక్తి -నర్సీపట్నం టౌన్ : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నాయకురాలు వి.సామ్రాజ్యం మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ , ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఫేషియల్ రికగ్నేషన్ యాప్ ద్వారా హాజరు విధానాన్ని రద్దు చేయాలని కోరారు అంగన్వాడీ కేంద్రాల్లో సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లగా పెండింగ్‌లో ఉన్న పలు బిల్లులు చెల్లించాలని కోరారు. అప్పులు చేసి, పిల్లలకు ఆహారం పెట్టే పరిస్థితుల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. రకరకాల యాప్‌లతో పనిభారం, ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి వచ్చేనెల 6న కలెక్టరేట్ వద్ద ఆందోళనకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాగమణి పర్వీన్ పాల్గొన్నారు. అనంతరం సిడిపిఒ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు

నర్సీపట్నం టౌన్ : సుప్రీంకోర్టు తీర్పు మేరకు అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, గ్రాటూ, ఇతర సౌకర్యాలను కల్పించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్‌డిఓ జయరామ్‌కు అందజేశారు. అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలను తీసుకొచ్చే బాధ్యత ఆయాలదేనని, అటువంటప్పుడు వారికి ఫేషియల్ రికగ్నేషన్ యాప్‌లో హాజరు వేయడం రెండు పనులూ ఒకే సమయంలో ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రకరకాల యాప్‌లతో ఒత్తిడికి గురిచేయవద్దని, తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం అప్పలరాజు, ఉపాధ్యక్షులు నవర మణి, కార్యవర్గ సభ్యులు రొంగల సత్య, పులగోరు వరలక్ష్మి, నర్సీపట్నం ప్రాజెక్టు నాయకులు ఘాటీలమ్మ, చిన్నారి, రాజేశ్వరి పాల్గొన్నారు.

కోటవురట్ల : కనీస వేతనం రూ.26వేలు అమలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. సిడిపిఒకు వినతిపత్రం అందించారు. ఫేషియల్ రికగ్నేషన్ హాజరు రద్దు చేయాలని, అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఉద్యోగ భద్రత ఇతర సౌకర్యాలను కల్పించాలని యూనియన్ నేతలు పుష్ప, చెన్నమ్మ డిమాండ్ చేశారు.

నక్కపల్లి : సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, కార్యదర్శి నూకరత్నం, రమణమ్మ ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. తమకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వీసులో వుండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, జాబ్ కేలండర్ నిర్ణయించాలని కోరారు. సిడిపిఒ శ్రీవిద్యకు సంఘ ప్రతినిధులు కవిత, లక్ష్మీరాజ్యం, భవానీ, జ్యోతి, పద్మలక్ష్మి, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు త్రినాథ్ వినతిపత్రం సమర్పించారు.

‘22ఎ’ కష్టాలు తీరేదెన్నడో..?

క్రయవిక్రయాలకు ఆస్కారం లేని వేలాది ఎకరాలు
అత్యవసర పరిస్థితుల్లో భూయజమానుల అవస్థలు
ఏళ్ల తరబడి పట్టించుకోని అధికారులు, నేతలు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల వ్యాప్తంగా కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ‘22ఎ’ భూములతో ప్రజలు నానాఅవస్థలు పడుతున్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2016 తర్వాత ‘22ఎ’ పరిధిలోకి మండల వ్యాప్తంగా వేలాది ఎకరాలు భూములు వెళ్లిపోవడంతో, అవి క్రయవిక్రయాలు జరగక భూయజమానులు, హక్కుదారులు అవస్థలు పడుతున్నారు. ఎస్‌సి, ఎస్‌టి బలహీన వర్గాలకు సంబంధించిన కేటాయించిన భూములు సహా దేవాదాయ, ఇనాం, వక్ఫ్, ప్రభుత్వ, పోరంబోకు భూములు సైతం ‘22ఎ’లో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఎంతటి అత్యవసర పరిస్థితి వచ్చినా వాటిని భూ యజమాని అమ్ముకునే హక్కు లేకపోవడం, కొనేవారు సైతం ముందుకు రాకపోవడంతో ఈ సమస్య ఏళ్లతరబడి ప్రహసనంగానే సాగుతోంది.

మండల వ్యాప్తంగా 20 రెవెన్యూ గ్రామాల పరిధిలోని25 గ్రామపంచాయతీల గ్రామాల్లో ‘22ఏ’ భూములు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలుపుతున్నారు. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, అనారోగ్య సమస్యలు, ఇతరత్రా అత్యవసర పరిస్థితుల్లో ఈ భూములను అమ్ముకునే హక్కు భూయజమానికి లేకుండా పోయింది. 40,483.80 ఎకరాల విస్తీర్ణం కలిగిన మండలంలో పట్టా భూమి 28,588.80 ఎకరాలుండగా, వాటిల్లో ప్రభుత్వ భూమి 8081.93 ఎకరాలు, అటవీ భూమి3012.66 ఎకరాలు ఉంది. ఇందులో గ్రామాల వారీగా చూస్తే 22ఎ భూములు వివరాలు ఎకరాల్లో విస్తీర్ణం ఇలా ఉంది. అన్నవరంలో 312.21 ఎకరాలు, బికెపల్లిలో 851.21, బోడపాలెంలో 464.28, చిన్న బొడ్డేపల్లిలో 227.03, చౌడువాడలో 189.22, గొట్టువాడలో 550 13, జల్లూరులో 343.28, కైలాసపట్నంలో 11 28.58, కొడవటిపూడిలో 448.80, కోటవురట్లలో 807.92, రంగాపురంలో 654.29, పాములవాకలో 291.58, పిరామన్నపాలెంలో 37.32, పొందూరులో 38 99.51, పీకే పల్లిలో 13 16.43, రాజుపేటలో 213.15, సుఖపూరులో 105.47, టీ జగ్గంపేటలో 11 94.02, తంగేడులో 339.52, ఎండపల్లిలో 275. 38 ఎకరాలు కలుపుకుని మండల వ్యాప్తంగా 14,650 ఎకరాల భూమి 22ఏలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు అంటున్నారు. వీటిల్లో పధానంగా చిన్న సన్నకారు రైతులు కూడా ఉండగా కొన్ని గ్రామాల్లో ఆయా భూముల్లో సొంతంగా ఇల్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్న వాళ్ళు ఉన్నారు. దీనిపై తహశీల్దార్ జానకమ్మను వివరణ కోరగా, 22ఎ పరిధిలో ఉన్న భూముల సమస్యకు సంబంధించి విధానపరమైన మార్గదర్శకాలు అనుసరించి సంబంధిత అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. వారి సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా : ఒకరు దుర్మరణం

ప్రజాశక్తి- జి.మాడుగుల : మండలంలోని సొలభం ఘాట్ రోడ్డులో మంగళవారం ప్రయాణికుల ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు దుర్మరణం పాలవ్వగా, నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ప్రయాణికులతో వస్తున్న ఆటో సొలబం ఘాట్‌రోడ్డులో ప్రమాదానికి గురికాగా, అందులో ప్రయాణిస్తున్న గడుతూరు పంచాయతీ పచ్చనాపల్లి గ్రామానికి చెందిన కూడా సన్యాసిరావు (53)తోపాటు మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక పిహెచ్‌సికి తరలించగా, డాక్టర్ శశికాంత్ ప్రథమచికిత్స అందించారు. పరిస్థితి విషమంగాఉన్న సన్యాసిరావును పాడేరు జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేయగా, అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృత్యువాత పడ్డాడు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే తెలుగుదేశం నేతలు అరకు పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు మత్స్యరాస వరహాలరాజు, టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిట్టిబాబు, స్థానిక సిఐ సత్యనారాయణ, తహశీల్దార్ అప్పలస్వామి తదితరులు క్షతగాత్రులను పరామర్శించారు. సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అంగన్‌వాడీ నియామకాలు పారదర్శకంగా చేపట్టాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం : అంగన్వాడీ పోస్టుల నియామకంలో అధికార పార్టీ నేతల సిఫార్సులకు తలొగ్గకుండా పారదర్శకంగా భర్తీ చేయాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల ఆర్‌డిఓ కార్యాలయంలో నిర్వహించిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీలో ఇంటర్వ్యూలు నామమాత్రంగానే నిర్వహించి, వైసిపి నేతల సిఫార్సులకే పెద్దపీట వేసి నియామకాలు చేపట్టాలని ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఆయాగ్రామాల్లో పోస్టుల కేటాయింపునకు వైసిపి నేతలు బాహాటంగానే బేరసారాలు కుదుర్చుకున్నారని విమర్శలు వస్తున్నాయన్నారు. అలాంటపుడు నోటిఫికేషన్ జారీ, ఇంటర్వ్యూలు ఈ తంతు అంతా ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇంటర్వ్యూల్లో పాల్గొన్న అభ్యర్థుల మెరిట్ జాబితా నోటీస్ బోర్డుల్లో వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రేగుపల్లి శివ, బోయిన చిరంజీవి, కర్రి సంతోష్, మారిశెట్టి రాజా, మాక్ రెడ్డి వెంకటరమణ, దత్తుడు ఉన్నారు.

పశువ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - చీడికాడ : మండలంలోని, ఖండివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు పశువ్యాధులపై ఖండివరం పశు వైద్యులు డాక్టర్ సిహెచ్ గణేష్‌రెడ్డి ధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కెజె.పురం వెటర్నరీ డాక్టర్ మణిలక్ష్మణ విద్యార్థులకు పశుసంవర్ధక సేవలు, పశువుల్లో జెనెటిక్ వ్యాధులు, పెంపుడు జంతువుల వల్ల వచ్చే వ్యాధులు, వాటి ద్వారా సంక్రమించే వ్యాధులు, వ్యాక్సినేషన్, ఇతర విషయాలపై అవగాహన కల్పించారు అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పిల్లలకు బహుమతులు పంపిణీ చేశారు

28 నుంచి ఎన్‌టిఎక్స్‌పి సందడి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : విశాఖలో నేషనల్ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి జి.మహేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 3 వరకూ జరిగే ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల నుంచి 200 మంది గిరిజన యువతీ యువకులు పాల్గొంటున్నారని చెప్పారు. అందులో భాగంగా రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్ ప్రాంగణంలో వారం రోజులపాటు జాతీయ స్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చత్తీష్‌ఘడ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. గిరిజన యువతకు సంబంధించిన భాష - సంస్కృతి, జీవన వ్యవహార శైలి, ఆర్థిక పరిస్థితులు, నివసించే పద్ధతులు, ప్రాంతాలను బట్టి వివిధ రకాల జీవన విధానాలు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

టిడిపికి గోడి అరుణ రాజీనామా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తెలుగుదేశం పార్టీ నేతల వైఖరిని తట్టుకోలేక బాధాతప్త హృదయంతో తెలుగు మహిళ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి, తెలుగుదేశం పార్టీ క్రియశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు గోడి అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగుదేశం పార్టీలో పదేళ్ల నుంచి చురుగ్గా పాల్గొంటూ నిబద్ధత, క్రమశిక్షణతో ఉన్న తనను కష్ట సమయంలో పార్టీ పట్టించుకోకపోవడం తీవ్రంగా బాధించిందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ

30న ఉక్కు మహా గర్జనకు తరలిరండి

ప్రజాశక్తి - కొయ్యూరు : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 30న విశాఖపట్నంలో సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్మిక మహాగర్జనకు తరలిరావాలని సిపిఐ అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ మహాగర్జనకు మద్దతుగా ఈ నెల 23, 24 తేదీల్లో రెవెన్యూ డివిజన్ కార్యాలయాల వద్ద దీక్షలు చేపట్టినట్లు చెప్పారు. 25న కలెక్టర్ కార్యాయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఇరువాడ దేవుడు, నాయకులు గండేపల్లి నూకరాజు, మొల్ల నాగరాజు, మాదల సత్యనారాయణ, నానాజీ పాల్గొన్నారు.



వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న సిఐ స్వామినాయుడు, శివప్రసాద్

వాలీబాల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యూరు : నేను సైతం ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని బి.కొత్తూరు, లబ్బర్తి, గింజర్తి, చింతలపూడి గ్రామాలకు చెందిన యువకులకు వాలీబాల్ కిట్లను కొయ్యూరు సిఐ ఎ.స్వామినాయుడు చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు శివప్రసాద్ మాట్లాడుతూ గిరి యువత మానసిక, శారీరకంగా దృఢంగా ఉంటూ, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండేందుకు క్రీడలను అరకు ఎంపీ గొడ్డేటి మాధవి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 40 వాలీబాల్ కిట్లను పంపిణీ చేశామన్నారు. వాలీబాల్ కిట్లు అవసరమైన వారు తమను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఆర్‌ఎస్‌ఐ చాణిక్య, ఫౌండేషన్ డైరెక్టర్లు కొరుప్రోలు పృథ్వీరాజ్, పంచాడి శ్రీరామ్మూర్తి, వైసిపి నాయకులు ఉల్లి సూరిబాబు, కొండబాబు పాల్గొన్నారు.

గాజువాకలో లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకు అవకాశం

ప్రజాశక్తి - కలెక్టరేట్

గాజువాకలో లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకు అవకాశముందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ లేపాక్షి పర్సన్ బడిగించల విజయలక్ష్మి, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి అన్నారు. ఎంపోరియం ఏర్పాటుకు అవసరమైన స్థలంగానీ, వ్యాపార సముదాయ భవనంగానీ కేటాయించాలని జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జునకు మంగళవారం ఆయన ఛాంబర్‌లో వారు వినతి పత్రం సమర్పించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో ఎపిహెచ్‌డిసి డైరెక్టర్ పైడి రమణ, విశాఖపట్నం లేపాక్షి ఎంపోరియం మేనేజర్ విజయ గౌరి, దయానంద పాల్గొన్నారు.

హమాలీ ఛార్జీల బకాయిలు చెల్లించాలి

అవకతవకలపై కలెక్టర్ విచారణ చేపట్టాలి
సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ

ప్రజాశక్తి-విఆర్.పురం

ప్రభుత్వం వ్యవసాయ సహకార సొసైటీల ద్వారా గతేడాది ధాన్యం కొనుగోలుకు సంబంధించి క్వింటాకు రూ.25 చొప్పన చెల్లించాల్సిన హమాలీ ఛార్జీలు నేటికీ ఇవ్వలేదని, తక్షణమే ఆ డబ్బులు చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రం రేఖపల్లిలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని రేఖపల్లి, ములకలపల్లి, పెద్దమటపల్లి కేంద్రాల్లో గతేడాది రైతులు ధాన్యం విక్రయించారని తెలిపారు. ఇందుకు క్వింటాకు రూ.25 చొప్పున హమాలీ ఛార్జీలు రైతులకు చెల్లించాల్సి ఉండగా, కేవలం 20 శాతం మాత్రమే చెల్లించారని, ఏడాది గడిచినా మిగిలిన 80 శాతం చెల్లించలేదని పేర్కొన్నారు. ఇదే అంశంపై మండల వ్యవసాయ అధికారిని అడిగితే సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు చేశారు కాబట్టి వాటికి తమకు ఎటువంటి సంబంధం లేదని సమాధానం ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఈ సమస్యపై స్పందించి ఏడాది కాలంగా బకాయి ఉన్న హమాలీ ఛార్జీలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. హమాలీ ఛార్జీల చెల్లింపుల వెనుక చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ జరిపించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. లేకుంటే రైతులను ఏకం చేసి సొసైటీల ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, రైతు సంఘం నాయకులు వడ్లధి రమేష్, సీనియర్ నాయకుడు పంపు శ్రీరామ్మూర్తి, పంకు సత్తిబాబు, కుంజ నాగిరెడ్డి, శ్రీరామ్మూర్తి, కారం సుందరయ్య, పూనెం సరోజిని, ప్రకాశరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పూనెం సత్యనారాయణ

ధాన్యం కొనుగోలు అంతంతమాత్రమే..!

లక్ష్యం : 87 వేల మెట్రిక్ టన్నులు
కొనుగోలు : 13 వేలు
ప్రభుత్వ నిబంధనలతో ఆసక్తిచూపని రైతులు



ధాన్యం కొలుస్తున్న హమాలీలు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ధాన్యం కొనుగోలు అంతంతమాత్రంగానే ఉంది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఇచ్చిన 21 రోజులకు బిల్లులు రైతుల ఖాతాలో జమచేస్తామని ప్రభుత్వం చెప్పినా, చెల్లింపులో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. దీనికితోడు ప్రభుత్వం పెట్టిన నిబంధనలు వారికి ప్రతిబంధకంగా ఉన్నాయి. అవి తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొనేలా లేకపోవడంతో ప్రయివేటు వ్యాపారులకు విక్రయించేందుకు మొగ్గుచూపుతున్నారు. దీంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో 87 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని పౌర సరఫరాల సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ మంగళవారం నాటికి 2,892 మంది రైతుల నుంచి 13,142 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయగలిగింది. డిసెంబరులో కొనుగోలు ప్రారంభించారు. జిల్లాలో 380 రైతు భరోసా కేంద్రాలను 78 క్లస్టర్లుగా ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేశారు. వీటి ద్వారా రూ.18.78 కోట్ల విలువైన 13,142 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయించిన 2,892 మంది రైతుల్లో 1807 మంది రైతులకు రూ.9.45 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. ఇంకా 1085 మంది రైతులకు రూ.9.33 కోట్లు రావాల్సివుంది.

ఈ ఖరీఫ్‌లో 1,36,232 ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖాధికారులు అంచనావేయగా, 1,39,242 (102 శాతం) ఎకరాల్లో రైతులు పండించారు. క్వింటా గ్రేడ్ - ఎ రకం ధాన్యానికి రూ.2060, సాధారణ రకానికి రూ.2040 చొప్పన ప్రభుత్వం ధర నిర్ణయించింది. ధాన్యం అమ్ముకొనేందుకు ముందుగా రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవడం, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతుల పంట ఈ - క్రాప్‌లో నమోదు చేసుకోవడంతో పాటు ఇకెవైసి చేసుకోవాలన్న నిబంధనలన్నీ రైతులకు తలనొప్పిగా ఉన్నాయి. ఇన్ని తలనొప్పులు భరించే కంటే కళ్లాల దగ్గరకొచ్చి ధాన్యం కొనే వ్యాపారులకు అమ్ముకోవడం రైతుకు సులభంగా ఉంది. ఎలాగూ నిబంధనలు ఆటంకంగా మారడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల కంటే ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకొనేందుకు పలువురు ఆసక్తిచూపుతున్నారు. అందువల్ల ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 87 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అనుకున్నా, 13,142 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయగలిగారు. రైతుల నుంచి ఫిబ్రవరి 15 వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత తెలిపారు.



మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి-కొయ్యూరు : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో వైసిపి సంక్షేమ పాలన అందిస్తుందని పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కొండగోకరి గ్రామ సచివాలయం పరిధిలోని మంగళవారం కినపర్తి, రిట్టవానిపాలెం, వలసంపేట, భీమవరం, గుజ్జువాని పాకలు, గోకరి, మొలకల మెట్ట గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం ఆమె నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. 481 గడపలను శాసనసభ్యులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో కినపర్తి సర్పంచ్ రేమల శ్రీను, కొండగోకరి సర్పంచ్ రేగటి ముసలి నాయుడు, ఎంపీటీసీ సద్దాం మల్లేశ్వరి, ఎంపీపీ బడుగు రమేష్ బాబు, జెడ్పిటిసి వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అప్పన్న వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు జల్లిబాబులు, బీసీ డైరెక్టర్ గాడి నాగమణి, ఏఎంసీ చైర్మన్ జైతి రాజులమ్మ, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గాడి సత్యనారాయణ పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

రాజయ్య మృతి తీరని లోటు

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని రేపాక గ్రామానికి చెందిన వెట్టి రాజయ్య మరణం సిపిఎంకు తీరని లోటని ఆ పార్టీ మండల కార్యదర్శి పాయం సీతారామయ్య అన్నారు. అనారోగ్యంలో రాజయ్య మరణించగా, ఆయన మృతదేహాన్ని మంగళవారం పార్టీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ రాజయ్య పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారని, పంచాయితీలో ఉన్న సీనియర్ నాయకులలో ఆయన ఒకరని పేర్కొన్నారు. ఆయన అనారోగ్యంతో మరణించడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, పార్టీ మండల కమిటీ సభ్యులు బాబు బొర్రయ్య, పాయం సత్యనారాయణ, శాఖ కార్యదర్శి మడకం జోగయ్య, మాజీ సర్పంచ్ ఎం.బొజ్జి, సత్యనారయణ, రాజులు, దర్మల శ్రీరాములు కార్యకర్తలు పాల్గొన్నారు.



నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఆటో డ్రైవర్ల సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రశాంత విశాఖలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు, దోపిడీలు, దొంగతనాలు, డ్రగ్స్, మత్తు పదార్థాల నివారణకు ఆటో డ్రైవర్లు పోలీసులకు సహకరించాలని క్రైమ్ విభాగం సిఐ ఎర్రమనాయుడు కోరారు. మంగళవారం అల్లిపురం వైర్లెస్ కాలనీలో ఆటో డ్రైవర్ల సదస్సును క్రైమ్ ఎస్ఐ కె.ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. డ్రైవర్లు, పోలీసుల మధ్య ఉన్న మైత్రిని అందరూ మెచ్చుకునే విధంగా ఆటోడ్రైవర్ల ప్రవర్తన ఉండాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌సి రమణ, సిహెచ్.సత్యనారాయణ, ఆటో సంఘం నాయకులు జి.వామనమూర్తి, వై.వెంకట్, కన్నారావు పాల్గొన్నారు.